భారంగా చెత్త సేకరణ

- పంచాయతీలపై అదనపు భారం
- తడిసిమోపెడవుతున్న డీజిల్ ఖర్చులు, జీతాలు
- ట్రాక్టర్ కిస్తీలతో బేజారవుతున్న సర్పంచులు


చెత్తను సేకరిస్తున్న జీపీ ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిత్యం తడి, పొడి చెత్త సేకరణ గ్రామపంచాయతీలకు భారంగా మారుతోంది. చెత్త సేకరణకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు రాక జీపీకి వచ్చే ఆదాయంతోనే ఏడాదంతా వెల్లదీస్తున్నారు. చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టడం తదితర పనుల కోసం గ్రామపంచాయతీలే కిస్తుల పద్ధతిలో బ్యాంకుల ద్వారా రుణం తీసుకుని ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. ఓవైపు నెలనెలా కిస్తులు చెల్లించడం, మరోవైపు పారిశుధ్య సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు సర్పంచులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎల్లారెడ్డిపేట మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉండగా అందులో 15 మైనర్ గ్రామపంచాయతీలే. ప్రధానంగా చెత్త సేకరణ కోసం రుణ పద్ధతిలో తీసుకున్న ట్రాక్టర్లకు ప్రభుత్వమే కిస్తులు చెల్లించాలని సర్పంచులు చేసిన విజ్ఞప్తులు బుట్ట దాఖలయ్యాయి. ఈ విషయం మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకుపోగా ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు.

నెలకు రూ.లక్ష ఖర్చు

గ్రామంలో చెత్త సేకరణ, మొక్కలకు నీరు పట్టేందుకు నెలకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. చెత్త సేకరణకు ఒక ట్రాక్టర్ వెంబడి ముగ్గురు పారిశుధ్య సిబ్బందితో పాటు ఒక డ్రైవర్‌కు కలిపి నెలకు రూ.30 వేలు, ట్రాక్టర్ కిస్తీ నెలకు రూ.10 వేలు, డీజిల్ ఖర్చు రూ.60 వేల చొప్పున మేజర్ గ్రామపంచాయతీలకు సుమారుగా రూ.లక్ష, చిన్న గ్రామపంచాయతీలకు నెలకు రూ.60 వేల చొప్పున జీపీ నిధుల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. పంచాయతీకి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తప్పకేంద్ర ప్రభుత్వం జీపీలకు ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు ఎడాది కాలంగా రాకపోగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఎస్ఎఫ్‌సీ నిధులు 8 నెలలుగా రావడం లేదని సర్పంచులు పేర్కొంటున్నారు. గ్రామంలో వీధిలైట్లతో పాటు, నీటి నిర్వహణ, నర్సరీ, శ్మశానవాటికల నిర్వహణ భారం కూడా పడుతోంది. ప్రధానంగా విద్యుత్ బిల్లులు చెల్లించలేక సర్పంచులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. కొన్ని గ్రామపంచాయతీల్లో నిర్వహణ భారం కావడంతో సర్పంచులు పారిశుధ్యాన్ని పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే ముందుకు వచ్చి ట్రాక్టర్ల సహాయంతో చెత్తను తొలగించుకుంటున్నారు.

రాబడి తక్కువ ఉన్న జీపీలకు నిధులు

పారిశుధ్య నిర్వహణ, ఇతర అభివృద్ధి పనులకు ఏడాదికి రూ.5 లక్షల రాబడి కంటే తక్కువగా ఉన్న జీపీలకు మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం చివరిలో అనగా మార్చిలో నిధులు మంజూరు చేస్తోంది. ఏడాదంతా సర్పంచులే తమ జేబుల నుంచి డబ్బులు ఖర్చు చేస్తే తప్ప ఏ పని జరిగే పరిస్థితి లేదు. సర్దుబాటులో కూడా అనేక సాంకేతిక కారణాలతో కొన్ని జీపీలకు నిధులు రాక సర్పంచులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో చేపట్టే అభివృద్ధి పనులు, చెత్త సేకరణ, మొక్కలు, నర్సరీ, శ్మశానవాటికల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులను కేటాయించాలని సర్పంచులు కోరుతున్నారు.

భారమవుతోంది



గ్రామంలో చెత్త సేకరణకు నెలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. నిర్వహణ భారం పడుతోంది. చెత్త సేకరణ, శ్మశానవాటిక, నర్సరీల నిర్వహణ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ప్రభుత్వం చిన్న గ్రామపంచాయతీలకే సర్దుబాటు నిధులను కేటాయిస్తోంది. అప్పులు చేసి గ్రామ అభివృద్ధి పనులు చేయాల్సిన పరిస్థితి ఉంది.

– నిమ్మ లక్ష్మి, సర్పంచ్, నారాయణపూర్

ఎలాగోలా సర్దుబాటు



గ్రామ పంచాయతీలకు ఏడాదిలో రూ.5 లక్షల రాబడి కంటే తక్కువగా ఆదాయం ఉంటే ప్రభుత్వం ఆర్థిక సంవత్సరం చివరిలో నిధులను సర్దుబాటు చేస్తుంది. చిన్న గ్రామ పంచాయతీలలో నిర్వహణ భారం కొంత ఇబ్బందిగా ఉంది. చెత్త సేకరణ లాంటి పనులకు జీపీ నిధులే కేటాయించుకోవాలనే నిబంధన ఉంది.

– చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

ఘనంగా మహానగర సంకీర్తన


రాచర్ల బొప్పాపూర్‌లో సాయిబాబా శోభాయాత్రలో భక్తులు

ఎల్లారెడ్డిపేట/తంగళ్లపల్లి: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్, తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సత్యసాయిబాబా ఆలయంలో బాబా 98వ జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఓంకారం, సుప్రభాతం, సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి చిత్రపటాన్ని గ్రామ పురవీధుల్లో మహానగర సంకీర్తన కార్యక్రమాన్ని జరిపారు. సాయంత్రం స్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండ రమేశ్‌గౌడ్, బాబు, రవి, భిక్షపతి, బండ సతీశ్, మాధవి, రేణుక పాల్గొన్నారు.

సేవ చేయాలనే రాజకీయాల్లోకి వచ్చా

- వేములవాడ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు


ర్యాలీలో పాల్గొన్న బీజేపీ అభ్యర్థి వికాస్‌రావు

మేడిపల్లి: డబ్బు మీద వ్యామోహంతో రాజకీయలకు రాలేదని సేవచేయాలనే లక్ష్యంతో వచ్చానని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్ రావు అన్నారు. గురువారం మేడిపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేడిపల్లి, భీమారం మండలాల్లోని కొండపూర్, విలయతాబాద్, కాచారం, రాగోజీపేట, ఓడ్డెడు, వెంకట్రావుపేట, కమ్మరిపేట, భీమారం, రంగాపూర్, గుండ్లపల్లి, పోరుమల్ల, తొంబర్రావుపేట, కట్టకుంట గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో తోగరి లక్ష్మీపతి, క్యాతం దశరథరెడ్డి, మహేందర్‌రెడ్డి, అన్నాడని జలపల్లిరెడ్డి, ఇజ్రయల్, దాసరి రఘు, కోటగిరి లింగాగౌడ్, గంగారాం, లింగారెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక


సాగర్‌జీ సమక్షంలో బీజేపీలో చేరిన రవీందర్‌గౌడ్

కోనరావుపేట: మండలం నాగారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వైస్‌ఎంపీపీ తీగల రవీందర్‌గౌడ్ మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, అభ్యర్థి వికాస్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయనతో పాటు కొండాపూర్ అనుబంధ గ్రామమైన హనుమాన్‌తండాకు చెందిన 100 మంది గిరిజనులు బీజేపీలో చేరారు. వీరందరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. గోపాడి సురేందర్‌రావు, మిర్యాల్‌కార్ బాలాజీ, గొట్టి రామచంద్రం, జవ్వాజి తిరుపతిగౌడ్, పల్లిమక్త సర్పంచ్ జిన్న అనిల్, చల్ల జితేందర్ తదితరులు ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు


కోనరావుపేట: మల్కపేటలో మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేటలో రజక సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, వైస్ ఎంపీపీ వంగపెల్లి సుమలత, బీఆర్ఎస్ అధ్యక్షుడు మల్యాల దేవయ్య, మహిళా నాయకురాలు నేరెళ్ల జ్యోతి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'చల్మెడ' తనయ ప్రచారం

కథలాపూర్: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఆయన కూతురు నివేదిత గురువారం ఇంటింటా ప్రచారం చేశారు. మహిళలకు బొట్టుపెట్టి ఓటు అభ్యర్థించారు. బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ఇంటింటా వెళ్లి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మాజీ ఎంపీపీ లోక భువనేశ్వరి, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, సర్పంచ్ గడీల గంగప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ కొత్తపెల్లి శ్రీనివాస్, తీట్ల శంకర్, బద్దం మహేందర్, గడ్డం దేవారెడ్డి, నర్సారెడ్డి, ముస్కు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

మేడిపల్లి: మండలంలోని బీమారం, కమ్మరిపేట, వెంకట్రావుపేట, రాగోజీపేట, గోవిందారం, రాజలింగంపేట, కట్లకుంట, పోరుమల్ల గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. చల్మెడ లక్ష్మీనరసింహరావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఆటో కార్మికులకు అండగా..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: ఆటో కార్మికులకు సీఎం కేసీఆర్ అండగా నిలుస్తున్నారని, ఇటీవల ఆటోలకు టాక్స్ రద్దు చేస్తానని ప్రకటించారని, ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై తప్పకుండా స్పందిస్తామని ఎమ్మెల్యే రమేశ్‌బాబు, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణ ఆటో యూనియన్ సభ్యులతో గురువారం సంగీత నిలయంలో ఆటో యూనియన్ సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు యాచమనేని శ్రీనివాసరావు, అధ్యక్షులు బత్తుల దేవరాజ్, పార్టీ పట్టణ ఇన్‌చార్జి రాజేందర్, నాయకులు జడల శ్రీనివాస్, బాబున్‌లతో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

పదేళ్లుగా ప్రజలతోనే ఉంటున్నా..

- ప్రస్తుత ఎమ్మెల్యే సంపాదనపై దృష్టి పెట్టారు
- కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం





గంగాధర: చొప్పదండి నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓడినా పదేళ్లుగా ప్రజలతోనే ఉంటున్నాను, నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రజలు, రైతాంగ సమస్యలపై పోరాటం చేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ చొప్పదండి ఎమ్మెల్యే అభ్యర్థి మేడిపల్లి సత్యం అన్నారు. మూడోసారి పోటీ చేస్తున్న మేడిపల్లి గురువారం సాక్షితో మాట్లాడారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజాసమస్యలకంటే సంపాదనపై ఎక్కువ దృష్టి పెట్టారని, 30న జరిగే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఓటర్లు భారీ మెజారిటీతో గెలిపించడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

ప్రశ్న:ఎన్నికల ప్రచారం ఎలా ఉంది?

మేడిపల్లి: ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు నుంచే గడప గడపకు కాంగ్రెస్ పేరుతో ఊరూరా తిరిగాను. ఓడినా పది సంవత్సరాలుగా ప్రజలతోనే ఉంటున్నా. రెండు సార్లు ఓడిన తనకు ఈసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వడానికి ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గతంలో గెలిచి ప్రజలను విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులకు గుణపాఠం చెబుతారు.

ప్రశ్న: కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారా?

మేడిపల్లి: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రచార సమావేశాల్లో వివరిస్తున్నాం. పార్టీ కార్యకర్తలు, నాయకులు గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి చెబుతున్నారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజలకు విశ్వాసం లేకుండా పోయింది.

ప్రశ్న:నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ ఎలా ఉంది?

మేడిపల్లి: ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఆదరణ పెరిగింది. ఇతర పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేస్తున్నాం.

ప్రశ్న: బీఆర్ఎస్, బీజేపీ నాయకుల దుష్ప్రచారాలను ఎలా తిప్పి కొడుతున్నారు?

మేడిపల్లి: ఓడిపోతున్నామనే ఫ్రస్టేషన్‌లో ప్రత్యర్థులు కాంగ్రెస్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారు. మాతో ప్రాణభయముందని, గెలిచాక పార్టీ మారుతామని చేస్తున్న ప్రచారాల్లో నిజం లేదు.

ప్రశ్న: ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గంలో మీరు చేసే అభివృద్ధి ఏమిటి?

మేడిపల్లి: ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత నారాయణపూర్ భూ నిర్వాసితులకు న్యాయం జరిగేలా చేయడంతో పాటు కుడి, ఎడమ కాలువల పనులు పూర్తి చేయిస్తాను. నారాయణపూర్, మంగపేట, చర్లపల్లి, ఇస్తార్‌పల్లి గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటింప చేయడంతోపాటు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాను. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తాను.

పుస్తెమెట్టెల వితరణ


పుస్తెమెట్టెలు అందజేస్తున్న వెంకట్‌రెడ్డి భార్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాజన్నపేటకు చెందిన చెట్టుపల్లి లక్ష్మి–రాములు దంపతుల కూతురు లాస్య వివాహానికి ఎల్లారెడ్డిపేట సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి గురువారం పుస్తెమట్టెలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, గన్న మల్లారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: ముస్తాబాద్‌కు చెందిన మిడిదొడ్డి నర్సయ్య, కనుకవ్వల కూతురు శిరీష వివాహానికి ఎంపీపీ జనగామ శరత్‌రావు పుస్తెమెట్టెలను గురువారం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన నర్సయ్య కూతురు శిరీష వివాహానికి దాతలు సహకరిస్తుండగా, ఎంపీపీ పుస్తె, మెట్టెలు, చీర అందజేసి మానవత్వం చాటుకున్నారు. వార్డు సభ్యురాలు నవీన, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత కాంగ్రెస్ ఉద్యోగుల ఇన్‌చార్జిగా నజీర్

బోయినపల్లి: అఖిల భారత అసంఘటిత ఉద్యోగుల కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన ఎండీ నజీర్‌ను నియమిస్తున్నట్లు కాంగ్రెస్ చొప్పదండి అభ్యర్థి మేడిపల్లి సత్యం నియామకపత్రం అందించారు. తన నియామకానికి సహకరించిన నేషనల్ చైర్మన్ ఉదిత్‌రాజ్, తెలంగాణ చైర్మన్ కొషల్ సమీర్, ప్రధానకార్యదర్శి పింగళి సంపత్‌రెడ్డి, సహాయకార్యదర్శి టీ రాజశేఖర్‌రెడ్డికు నజీర్ కృతజ్ఞతలు తెలిపాడు.

రేషన్ కార్డులివ్వలే.. ఒక్క జాబ్ రాలే

- సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్ తెస్తా
- సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ


రోడ్‌షోలో అభివాదం చేస్తున్న బీజేపీ అభ్యర్థి రాణీరుద్రమ

సిరిసిల్ల: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని సిరిసిల్ల బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమ అన్నారు. సిరిసిల్లలో గురువారం ఆమె రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగుసార్లు కేటీఆర్‌ను ఎమ్మెల్యే చేస్తే నాలుగు రోజులైనా సిరిసిల్లలో నిద్రపోలేదని, ప్రజలకు అందుబాటులో లేరని ఆరోపించారు. ఒక్క ఐటీ కంపెనీ తేని, ఒక్క ఉద్యోగం భర్తీ చేయని కేటీఆర్ సిరిసిల్ల దేశానికి ఆదర్శమంటున్నాడని వివరించారు. ఇసుక దోపిడీలో, అనుచరులు భూకబ్జాల్లో, డబుల్ బెడ్రూం ఇళ్లను అమ్ముకోవడంలో ఆదర్శమని ఆరోపించారు. ఏడు గ్రామాలను సిరిసిల్లలో కలిపి ఆ గ్రామాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి, పన్నుల భారాన్ని మోపారన్నారు. అనుచరులకే కాంట్రాక్టులు ఇచ్చి దోచుకున్నారని ఆరోపించారు. తనను గెలిపిస్తే సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్‌ను ప్రధాని మోదీ సహకారంతో సాధిస్తానని రాసిచ్చిన బాండ్ పేపర్‌ను ఇంటింటికీ పంపుతానన్నారు. సిరిసిల్ల కొత్త బస్టాండు నుంచి అంబేద్కర్ సర్కిల్ మీదుగా గాంధీచౌక్ వరకు రోడ్‌షో సాగింది. కార్యక్రమంలో ఏపీ బీజేపీ అధికార ప్రతినిధి జయప్రకాశ్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, ఆడెపు రవీందర్, వెంకటలక్ష్మి, భాస్కర్‌రెడ్డి, కమలాకర్‌రావు, రెడ్డబోయిన గోపి, చందు, స్థానిక కౌన్సిలర్లు బొల్గం నాగారాజు, గూడూరి భాస్కర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రహదారిపై గుంత



వేములవాడఅర్బన్: వేములవాడ నందికమాన్ ప్రాంతంలోని సిరిసిల్ల-కరీంనగర్ రహదారిలో కొడుముంజ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ముందు వరకు ఫోర్ వే లేన్ వేశారు. అక్కడి నుంచి డబుల్ రోడ్డు ఉండటంతో వాహనాల తాకిడి ఒకసారిగా వన్‌సైడ్ కావడంతో నడిరోడ్డుపై రహదారి గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు ఆ గుంతపై మట్టి పోశారు. వాహనాల తాకిడికి మట్టి పోయి ద్విచక్ర వాహనాలు స్కిడ్ కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకుని రహదారి గుంతలకు మరమ్మతు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వం




రేణికుంట బహిరంగ సభలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, నుస్తులాపూర్ సొసైటీ మాజీ చైర్మన్ అలువాల కోటికి కండువా కప్పుతున్న రేవంత్‌రెడ్డి

- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

గన్నేరువరం: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు అన్నారు. పార్టీకి చెందిన గన్నేరువరం మండల పరిషత్ అధ్యక్షుడు లింగాల మల్లారెడ్డి, నుస్తులాపూర్ సహకార సంఘం మాజీ చైర్మన్, ఉద్యమ నాయకుడు అలువాల కోటీ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కట్టా కొముర‌య్య గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన అనంతరం తిమ్మాపూర్ మండలం రేణికుంట టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలువాల కోటి 2001 నుంచి ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. అదే సమయంలో ఓ కార్యక్రమానికి వెళ్లే క్రమంలో జరిగిన ప్రమాదంలో సగం పాదం కోల్పోయారు. వీరితో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మానకొండూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ, కవ్వంపల్లి అనురాధ, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్కూరి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి బొడ్డు సునిల్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మెర రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ రోడ్ షోతో భారీగా ట్రాఫిక్ జామ్


సారంపల్లి ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్

తంగళ్లపల్లి: మండలంలోని సారంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోతో సిద్దిపేట–సిరిసిల్ల ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటన్నరసేపు ట్రాఫిక్‌లో వేచిచూడాల్సి వచ్చింది. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు తంగళ్లపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు చెమటోడ్చారు. స్కూల్ బస్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో విద్యార్థులు బస్సులోనే హోమ్‌వర్క్ చేసుకుంటూ కనిపించారు.